


భీష్మ ఏకాదశి సందర్భంగా.. సత్యదేవుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు - 7లో
విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు - 7లో



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు



మండపేట భక్తులు సమర్పిస్తున్న కల్యాణ కొబ్బరి బొండాలు

కల్యాణ వైభోగమే

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణం కన్నుల పండువగా జరిగింది..వేలాది మంది భక్తుల సమక్షంలో ఆ దేవదేవుని వివాహ మహోత్సవం శోభాయమానంగా సాగింది. సోమవారం అర్ధరాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని పరిణయమాడారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ తంతు వైభవోపేతంగా సాగింది.

వార్తలు 7లో



స్వామివారి కల్యాణ కొబ్బరిబొండాలు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు

భవిష్యత్తుకు.. 'గ్యారెంటీయే'



పిఠాపురం నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ పత్రాలను అందిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వర్మ

- జిల్లాలో ఉధృతంగా 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' ప్రచారం
- నియోజకవర్గాల్లో సగానికి పైగా ఇళ్లను చుట్టేసిన టీడీపీ శ్రేణులు
- నోటిఫికేషన్ వెలువడేలోపు జిల్లాలో మొత్తం 4.95లక్షల కుటుంబాలను చేరుకునేలా లక్ష్యం
- డిసెంబరు 1నుంచి ఇంటింటికీ వెళ్లి పార్టీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న క్యాడర్
- టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే ఒనగూరే ఆర్థిక లబ్ధిని వివరిస్తున్న వైనం
- ఒక్కో ఇంట్లో కుటుంబసభ్యులను లెక్కించి మొత్తం లబ్ధిపై సంతకాలు
- సూపర్‌సిక్స్ పథకాలకు జనంలో ఆదరణతో వైసీపీలో గుబులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలకు ముహూర్తం దగ్గరపడ్డ నేపథ్యంలో జిల్లాలో టీడీపీ క్షేత్ర స్థాయిలో ప్రచారం మరింత ముమ్మరం చేసింది. కొన్నినెలలుగా నియోజకవర్గాల్లో బూత్‌లవారీగా ప్రతి కుటుంబాన్ని కలుస్తూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ అందరికీ చేరువవుతోంది. టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి సూపర్‌సిక్స్ పథకాలవల్ల కలగనున్న ఆర్థిక లబ్ధిని వివరిస్తూ వారికి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలను అందిస్తోంది. టీడీపీ, జనసేన కూటమిని గెలిపించడం ద్వారా ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి పథకాల ద్వారా ఆర్థికంగా ఎన్ని లక్షలు అందించబోతున్నది అక్కడికక్కడే లెక్కలు కట్టి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సంతకాలతో కూడిన గ్యారెంటీ పత్రాలను ఇస్తోంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 4.95లక్షల గృహాలుండగా ఇప్పటికే సగం ఇళ్లను పార్టీ నేతలు చుట్టేశారు. తద్వారా వైసీపీ బటన్ నొక్కుడు ప్రచారానికి దీటైన అస్త్రాలతో టీడీపీ జనంలోకి దూసుకువెళ్తోంది. సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన బాబు ష్యూరిటీ పత్రాలకు జనంలో అనూహ్య ఆదరణ లభిస్తుండడంతో వైసీపీ విలవిల్లాడుతోంది.

పథకాలపై పూసగుచ్చి మరీ..

రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీడీపీ వినూత్న విధానంలో జనానికి ఇప్పటినుంచే చేరువవుతోంది. ఇప్పటివరకు ప్రతి ఎన్నికల్లో పార్టీనేతలు, క్యాడర్ ఇంటింటికీ వెళ్లి టీడీపీని గెలిపించండి అనే ప్రచారం చేసేవారు. అధికారంలోకి రాగానే సంక్షేమం ఎలా అందించేది వివరించారు. కానీ ఈసారి అధికార వైసీపీ ఎత్తులను చిత్తు చేసేలా సరికొత్తగా జనంలోకి వెళ్తోంది. ఇందులోభాగంగా గతేడాది రాజమహేంద్రవరంలో నిర్వహించిన టీడీపీ మహానాడులో చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వ్యూహాత్మకంగా జనంలోకి బలంగా తీసుకువెళ్తోంది. సంప్రదాయ ప్రచారం స్థానంలో కొత్తగా ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించి ఆయా ఇంట్లో ఎంతమంది ఉన్నారో లెక్కించి వారికి ఈ పథకాల ద్వారా ఒనగూరే ఆర్థిక లబ్ధిని వారి ముందే లెక్కించి ఏడాదికి ఆ కుటుంబానికి ప్రభుత్వం ఎంత మొత్తం నగదు రూపంలో చెల్లించబోతోంది అనేది వివరిస్తోంది. ఆ మొత్తాన్ని బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రంపై ప్రస్తావిస్తోంది. ఈపత్రంపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సంతకాలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, పార్టీ బూత్ ఇన్‌ఛార్జి సంతకాలు చేసి మరీ ప్రతి కుటుంబానికి గ్యారెంటీ పత్రం అందిస్తున్నారు. తద్వారా టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఎంత అవసరం అనేది ప్రతిఒక్కరికీ చేరవేస్తున్నారు. డిసెంబర్ 1 నుంచి జిల్లాలో నియోజకవర్గాలవారీగా పార్టీ నేతలు, క్యాడర్ తమ పరిధిలో ఇళ్లకు వెళ్లి ఈ పత్రాలను అందిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి ఇస్తున్న ఈ గ్యారెంటీ పత్రం ప్రకారం ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎవరికీ ఏ కోతలు, కొర్రీలు లేకుండా సూపర్‌సిక్స్ పథకాలను వర్తింప చేస్తామని హామీ ఇస్తున్నారు. దీంతో నియోజకవర్గాల్లో ఎక్కడి కక్కడ ప్రజల్లో అనూహ్య ఆదరణ లభిస్తోంది.

నియోజకవర్గాలవారీగా పత్రాల పంపిణీ ఇలా..

వాస్తవానికి నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లకు సంబంధించి ఎన్ని ఇళ్లు ఉన్నాయో గుర్తించి వాటన్నింటినీ బూత్‌లవారీగా టీడీపీ నేతలు చుట్టేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జగ్గంపేట నియోజకవర్గంలో మొత్తం 68,886 ఇళ్లకు గాను 30వేలకుపైగా కుటుంబాలకు ష్యూరిటీ పత్రాలు అందించారు. ప్రత్తిపాడు 67,196 కుటుంబాలకు 40వేలు, పెద్దాపురం 63,851కి 38వేలు, పిఠాపురం 72,574ఇళ్లకు 45వేలు, కాకినాడ సిటీలో 80,268 కుటుంబాలకు 28వేలు, కాకినాడ రూరల్ 73,747 కుటుంబాలకు 20వేలు, తుని 69,426 కుటుంబాలకు 36వేలకుపైగా గృహాలను చుట్టి ఆయా కుటుంబాలకు బాబు ష్యూరిటీ పత్రాలు అందించారు. వీటిలో సరాసరిన ఒక్కో కుటుంబానికి ఆయా కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాతలకు రైతుకు ఆర్థిక సాయం, యువగళం నిరుద్యోగభృతి, దీపం కింద ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇలా సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు లబ్ధి కలుగుతోంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ష్యూరిటీ పత్రాలను ప్రజలకు టీడీపీ శ్రేణులు అందిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 4.95లక్షల కుటుంబాలకు ఈ పత్రాలను అందించాలని టీడీపీ లక్ష్యం విధించుకుంది. వీటిలో సగానికిపైగా లక్ష్యం పూర్తి కాగా షెడ్యూల్ వచ్చేలోపు మిగిలిన లక్ష్యాన్ని చేరుకునేందుకు పార్టీ నేతలు పరుగులు తీస్తున్నారు. ప్రతికుటుంబానికి ఇచ్చే ష్యూరిటీ పత్రానికి ఆన్‌లైన్‌లో ప్రత్యేక నెంబర్ కేటాయిస్తున్నారు. పక్కా సమాచారంతో ఆయా కుటుంబాల వివరాలను నమోదు చేసి భవిష్యత్తులో పథకాల ద్వారా ఆర్థిక లబ్ధిని అందిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మునిగిపోతున్న బటన్ నొక్కుడు ప్రచారం..

వాస్తవానికి వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి జిల్లాలో అభివృద్ధిని పక్కనపెట్టి మౌలిక వసతులను వదిలేసి కేవలం నవరత్నాల పేరుతో వివిధ పథకాలకు సంబంధించి బటన్‌లు నొక్కుతోంది. పైగా ఏయేటికాయేడు నవరత్నాల్లో ప్రతి పథకానికి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్యను అడ్డగోలుగా కోసేసి తక్కువ మందికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతోంది. పైగా రెండేళ్లుగా బటన్ నొక్కినా ఆ కొంచెం డబ్బులు కూడా నెలల తరబడి ఖాతాల్లో జమవడం లేదు. అయినా సరే బటన్ నొక్కుడు తమంతగా ఏ పార్టీ చేయడం లేదంటూ వైసీపీ జనంలో గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో దీనికి ధీటుగా టీడీపీ, జనసేనలు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల ద్వారా ఎన్ని లక్షల లబ్ధి అందించబోతున్నామనేది ఏకంగా ష్యూరిటీ పత్రాలను ప్రజలకు ముందే ఇస్తుండడంతో వైసీపీకి షాక్ తలుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే సూపర్‌సిక్స్ పథకాలు జనంలోకి బలంగా వెళ్లడంతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీనికి ధీటైన ప్రచారం తమవద్ద లేకపోవడంతో జనం ముందు పార్టీ తేలిపోతోందని వైసీపీ నేతలు తలపట్టుకుంటున్నారు. నవరత్నాలను చూసి పార్టీకి ఓటేయాలని జనాలను వేడుకుంటున్నా ఆదరణ ఉండడం లేదని తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

మత్స్యకారుల వలలకు చిక్కిన కోనాములు

- రూ.50లక్షల విలువైన చేపల లభ్యం



ఉప్పాడ రేవులో మత్స్యకారుల వలలకు లభ్యమైన కోనాము చేపలు

ఉప్పాడ(కొత్తపల్లి), ఫిబ్రవరి 19: తీరప్రాంత మత్స్యకారులకు సోమవారం కోనాముల పంటపండింది. ఉప్పాడ-అమీనాబాద్ తీరంనుంచి తెల్లవారుజామున వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు కోనాము చేపలు చిక్కాయి. రూ.50లక్షల విలువైన కోనాములు లభ్యమవడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల సముద్రంలో సరైన వేట లేకపోవడంతో వేటకు వెళ్లిన ప్రతిసారి నిరాశతో ఒడ్డుకు చేరుకునే పరిస్థితి కనీసం డీజిల్ ఖర్చులకు కూడా చేపలు దొరకపోవడంతో చేసిన అప్పులు తీరక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సోమవారం వారికి చేపలు దొరకడంతో తీరంలో సందడి నెలకొంది.

'కాకినాడ-అయోధ్య' బస్సు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీటీవో శ్రీనివాసరావు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 19: కాకినాడ నుంచి అయోధ్యకు సోమవారం ప్రత్యేక బస్సు బయలుదేరింది. ఈ బస్సును కాకినాడ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు పది రోజుల యాత్రలో 14 క్షేత్రాలను సందర్శించి తిరిగి ఈనెల 29న కాకినాడ చేరుకుంటుంది. ఈ యాత్రలో పూరి, కోణార్క్, సాక్షిగోపాలం, భువనేశ్వర్, జాజిపూర్, గయా, బుద్ధగయ, శిరోగయ, వారణాసి, ప్రయాగ్రాజ్, సీతామడి, అయోధ్య, నైమిశారణ్యం చూపిస్తారు. ఈ యాత్రకు భోజనాలతో కలిపి ఒక్కొక్కరికీ రూ.11వేల చొప్పున టికెట్ వసూలు చేస్తారు. కార్యక్రమంలో డీఎం ఎంయుపీ మనోహర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 19: ప్రజల సౌలభ్యం కోసం ఈనెల 20 నుంచి 23 వరకు నాలుగురోజులపాటు నగరంలోని తొమ్మిది ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌లోని డాక్యుమెంట్ అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్‌ఐడీ అనుసంధానం, బయోమెట్రిక్ అప్‌డేట్(ఫొటో, ఐరిస్, వేలిముద్ర),పేరు, పుట్టినతేదీలు, చిరునామాల్లో మార్పులు, కొత్త ఆధార్ నమోదు, ఆధార్ డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి సేవలను ఈ శిబిరాల్లో పొందవచ్చన్నారు. కృష్ణనగర్-2ఏ, డైరీఫారమ్-11ఏ, గోలీలపేట-14ఏ, యానాంరోడ్డు 15-ఏ, చిన్నమార్కెట్21-1, యాళ్లవారి వీధి 28బీ, బ్యాంకుపేట-32ఏ, గాంధీనగర్-38ఏ, గైగోలుపాడు-50బీ సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

'స్పందన'కు 383 అర్జీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 19: జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి 383 అర్జీలందాయి. కాకినాడ కలెక్టరేట్ స్పందనహాల్‌లో సోమవారం డీఆర్వో డి.తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ ఎన్వీ సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి కలెక్టర్ కృతికాశుక్లా వినతులను స్వీకరించారు.

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎంపీ విఠల్ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ విఠల్‌ని అభినందిస్తున్న మినిస్టీరియల్ సంఘం సభ్యులు

జీజీహెచ్(కాకినాడ),ఫిబ్రవరి 19: కాకినాడ జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎంపీ విఠల్‌ని సోమవారం ఆస్పత్రి కాకినాడ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు ఆధ్వర్యంలో పలువురు అభినందనలు తెలిపారు. జిల్లా కార్యదర్శి వీవీ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ టీఎస్‌ఎల్ మూర్తి, సిటీ జాయింట్ సెక్రటరీ రమేష్, పసుపులేటి అనురాధాకృష్ణ, కిషోర్, బేబీ లావణ్య ఉన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

పొన్నాడ(కొత్తపల్లి), ఫిబ్రవరి 19: పొన్నాడలో మూడురోజులుగా జరుగుతున్న బంగారుపాప ఉరుసు ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈనెల 16నుంచి 18 వతేదీ వరకు రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు పొన్నాడ విచ్చేసి బంగారుపాపను దర్శనం చేసుకున్నారు. బంగారు పాప ఆలయ ముజావర్లు దూరప్రాంతాలనుంచి బంగారుపాప దర్గాకు వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు. మూడు రోజులపాటు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పాథాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలి

- డీఎంహెచ్‌వో నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రిజిస్ట్రేషన్ కలిగిన ప్రతి ప్రైవేట్ లాబొరేటరీలోను పాథాలజిస్ట్ ఉండాలని, వీరితోనే వ్యాధి నిర్ధారణ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అలోపతి ప్రైవేట్ ఎస్టాబ్లిష్ చట్టం మేరకు అన్ని ప్రైవేట్ ల్యాబ్‌ల్లో 1, 2, 3 కేటగిరీలవారీగా అర్హత కలిగిన పెథాలజిస్ట్ నియమించుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయమై ఇప్పటికే మూడుసార్లు నోటీసులు జారీచేశామన్నారు. నిబంధనల మేరకు పాథాలజిస్ట్ లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా అనధికారికంగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్న వాటిపై ఏపీపీ ఎంసీఈ యాక్ట్ ప్రకారం మూసివేయాలని ఆదేశించారు.

రాజమహేంద్రవరానికి.. జనసేనాని రాక

- ప్రత్యేక హెలికాప్టర్‌లో మధురపూడి చేరుకున్న పవన్‌కల్యాణ్
- రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో రాత్రి బస
- ఎన్నికలపై నేడు ఉమ్మడి జిల్లా నేతలతో చర్చలు



రాజమహేంద్రవరంలో పవన్‌కల్యాణ్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19:జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం రాత్రి 8.20గంటలకు విశాఖనుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం దగ్గర్లోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అక్కడినుంచి భారీ కాన్వాయ్‌తో రాజమహేంద్రవరం నగరంలోని హోటల్ షెల్టన్‌లో బస వద్దకు చేరుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనసేన పోటీ చేసే అసెంబ్లీ సీట్లకు సంబంధించి ఆయానియోజకవర్గాల జనసేన నాయకులు, ఇతర ముఖ్యులతో పవన్‌కల్యాణ్ సోమవారం నుంచి రెండురోజులపాటు చర్చించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం చేరుకునేసరికి రాత్రి కావడంతో నాయకులతో చర్చలు మరుసటిరోజుకు వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. మంగళవారం నాయకులతో చర్చించే అవకాశం ఉంది. పవన్‌కల్యాణ్ బసచేసిన షెల్టాన్ హోటల్ వద్దకు భారీసంఖ్యలో నాయకులు, అభిమానులు తరలిరావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. పవన్ వెంట జనసేన ఉమ్మడి తూర్పు జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ ఇతర నాయకులు ఉన్నారు.

మత్స్యకార జాతిని హేళన చేసిన ద్వారంపూడిని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి

- టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరు, రమేష్ ధ్వజం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 19: ప్రపంచం గర్వించదగిన మత్స్యకార జాతిని హేళన చేస్తూ విమర్శలు చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడిని కాకినాడనుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ ధ్వజమెత్తారు. మత్స్యకార జాతిపై ద్వారంపూడి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వారంపూడి ముఖంలో ఓటమి స్పష్టంగా కనిపిస్తోందని, ఆయన చేస్తున్న అవినీతి, భూకబ్జా, దోపిడీలపై తమ నాయకుడు కొండబాబు ప్రశ్నిస్తే సూటిగా సమాధానం చెప్పకుండా మత్స్యకార జాతిని అవహేళన చేస్తూ విమర్శలు చేయడం తగదన్నారు. టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.500కోట్లు దోచేసి కేవలం రూ.2కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టి ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. అధికార, ధనమదంతో విమర్శలు చేస్తున్న ద్వారంపూడికి రాబోయేకాలంలో మత్స్యకారుల సత్తా ఏంటో చూపించి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో మత్స్యకార నాయకులు ఎరిపిల్లి రాము, చోడిపిల్లి సతీష్, మూగు రాజు, సంగాని నాగేశ్వరరావు, తుమ్మల కొండలరావు, మల్లాడి చిన్ని, అరదాడి శివ, గంపల లక్ష్మణరావు, కాశరపు సింహాద్రి, గరికిన సింహాద్రి, మల్లాడి లోవరాజు పాల్గొన్నారు.

ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి: జనసేన మత్స్యకార విభాగం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 19: మత్స్యకార జాతిని కించపరిచిన ఎమ్మెల్యే ద్వారంపూడి క్షమాపణ చెప్పాలని జనసేన మత్స్యకార వికాస విభాగం సమావేశం డిమాండ్ చేసింది. కాకినాడ సినిమారోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన సమావేశానికి మత్స్యకార ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మల్లాడి రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మత్స్యకారులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ద్వారంపూడి క్షమాపణ చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కొండబాబును వ్యక్తిగతంగా, మత్స్యకారులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మత్స్యకార జాతిని కించపరిచిన ద్వారంపూడిని వచ్చే ఎన్నికల్లో మత్స్యకారులంతా ఏకమై ఇతర కులాల సహకారంతో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వంకా కొండబాబు, షైలపల్లి రాజు, సోదే రవికిరణ్, లంకే వెంకట్రావు, వాడ్రేవు రాఘవ పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమ ఆస్తుల బదలాయింపుపై ఈడీ విచారణ జరపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు



ఎన్‌ఎఫ్‌సీఎల్ ఆస్తులను పరిరక్షించాలని కరపత్రాలను చూపిస్తున్న మధు

కాకినాడ సిటీ/సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 19: ఎన్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమ ఆస్తుల బదలాయింపుపై ఈడీ విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. కాకినాడ పీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆస్తులు పరిరక్షించాలని ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కాకినాడలోని ఎన్‌ఎఫ్‌సీఎల్, కోరమాండల్ పరిశ్రమల వద్ద ఉద్యోగులకు కరపత్రాలు పంచుతూ భవిష్యత్తు ఆందోళనకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నెలరోజుల్లో కంపెనీ యాజమాన్యంగానీ, ప్రభుత్వంగానీ స్పందించకపోతే హైకోర్టులో ప్రజాప్రయోజనం దావా వేస్తామన్నారు. రెండురోజుల క్రితం కాకినాడ ఎన్‌ఎఫ్‌సీఎల్ జంతు ప్రదర్శనశాలలోని జింకలు, దుప్పిలు, ఇతర జంతువులను వేరే ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. గ్రీన్‌బెల్ట్ 600 ఎకరాలను వ్యక్తిగత పేర్ల మీద గ్రీన్‌కో సంస్థకు బదలాయింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న చలమలశెట్టి సునీల్ సమాధానం చెప్పాలన్నారు. లేకపోతే మార్చి 1 నుంచి దశలవారీ ఆందోళనలు నిర్వహిస్తామని, దీనిలో ఉద్యోగ సంఘాలు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. అవసరమైతే ఎన్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమను ప్రభుత్వం నడపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పీఎస్ నారాయణ, కె.అప్పలరాజు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుడి కల్యాణం


లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- కల్యాణం తంతు నిర్వహించిన వేద పండితులు
- పట్టువస్త్రాలు సమర్పించిన శృంగేరి, పాలమూరు వారు
- కనులారా వీక్షించిన భక్తజన సందోహం

అంతర్వేది, ఫిబ్రవరి 19: నవ నారసింహ క్షేత్రాల్లో అగ్రగామి అయిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణోత్సవ శోభతో వెల్లివిరిసింది. వేద మంత్రోచ్చారణలతో సకల దేవతల ఆశీర్వచనాలతో శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిలను కల్యాణమాడారు. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రివారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతోచూసి తరించారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం సోమవారం దశమి రాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు వైభవంగా జరిగింది. వైష్ణవ సాంప్రదాయబద్ధంగా వేద పండితులు, అర్చక స్వాములు కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. శుభ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయఅర్చకులు ఉంచారు. ఆలయం ముందు నిర్మించిన శాశ్వత షెడ్లలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు


స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆశీనులై స్వామివారి కల్యాణం వీక్షించారు. ఉభయ రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. సుమా రు నాలుగు గంటల పాటు సాగిన స్వామివారి కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఉచిత దర్శనం కోసం ఎదురు చూశారు.

ఎదురు సన్నాహంతో శ్రీకారం

రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. అనాధిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం పశ్చిమగోదావరిజిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్ శ్రీవారి తరపున, అర్చక స్వాములు అమ్మవారి తరపున వివాహకర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామి వారిని తర్వాత అమ్మవార్లను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు, అధికారులు పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు, అమ్మవార్లకు అంతర్వేదికరకు చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. కల్యాణం నిర్వహణలో ఆనవాయితీ ప్రకారం పేరూరు వేద పండితులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి తలంబ్రాలను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పొలమూరి కుటుంబీకులు తీసుకువచ్చారు.

స్వామి, అమ్మవార్లకు మధుపర్కాలు..

కల్యాణానికి ముందు దేవస్థానం తరపున ఆలయ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మొగల్తూరు రాజా వారు ఆలయ ఫౌండర్ రాజాకలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఎస్పీ ఎస్.శ్రీధర్, ఆలయ అధికారులు, భక్తులు శ్రీ స్వామి, అమ్మవార్లకు మధు పర్కాలు సమర్పించారు.

అద్భుతంగా విద్యుత్ అలంకరణలు

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పుణ్యక్షేత్రం విద్యుత్ అలంకరణల నడుమ రంగురంగులతో భక్తులకు కనువిందు చేస్తుంది. భక్తుల రద్దీ ఉన్న ప్రతి ప్రధాన కూడలిలో కల్యాణోత్సవాలను తిలకించేలా ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేసి గ్రామ పురవీధుల ముఖద్వారాలను సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. స్వామివారి కల్యాణ మండపాన్ని, ఆలయాన్ని అద్భుతంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. అయోధ్య బాలరాముడు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, వివిధ సెట్టింగ్‌లతో ఆలయ పుణ్య క్షేత్ర మంతా అలంకరించారు.


అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు


స్వామి కల్యాణానికి హాజరైన ఎస్పీ శ్రీధర్ దంపతులు




గ్రామోత్సవం


పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై నిర్వహిస్తున్న స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి సత్యనారాయణమూర్తి, నరసింహస్వామివారిచే నిర్మితమైన శ్రీ పంచ ముఖ ఆంజనేయస్వామివారి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామివారు గ్రామోత్సవం జరగ్గా భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. రాత్రి 7గంటలకు అంతర్వేది పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులచే నిర్మితమైన కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిపారు. అనంతరం స్వామివారిని కల్యాణ మండపానికి తీసుకునివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, పి.వెంకటకృష్ణ, మూలాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారంరాత్రి జరిగిన స్వామివారి కల్యాణం, అనంతరం మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.00 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సోమవారం రాత్రికే రథంవద్ద అరటిపండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు ఇచ్చారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు. శ్రీ స్వామివారి రథోత్సవం రాజావారి వీధి నుంచి ఆచార సాంప్రదాయాల లాంచనాలతో సోదరి గుర్రాలక్కమ్మ అశ్వరూఢాంబిక ఆలయం వద్దకు చేరుకుని చీర, సారెలతో సోదరికి అందజేసి తిరుగు ప్రయాణంలో స్వామివారి రథం 16స్తంభాల మండపం వద్దకు చేరుకుంటుంది.


రద్దీగా మారిన అన్నవరం సత్యదేవుడి ఆలయ ప్రాంగణం

భీష్మ ఏకాదశి సందర్భంగా ..

సత్యదేవుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- వసతి గదులు సరిపడక భక్తుల అవస్థలు

అన్నవరం, ఫిబ్రవరి 19: సత్యదేవుడి సన్నిధి మంగళవారంరోజున బీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి దర్శనానికి సోమవారం రాత్రికే తరలిరావడంతో ఆలయప్రాంగణం పోటెత్తింది. సత్రంగదులు సరిపడకపోవడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయప్రాంగణంలో సేద తీరారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారంరాత్రి 11గంటల నుంచి వ్రతం టిక్కెట్లను విక్రయించి ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని ఈవో రామచంద్రమోహన్ సర్క్యులర్ జారీ చేశారు. భక్తులకు క్యూలైన్‌లో ఎటువంటి అవస్థలు పడకుండా త్రాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే రద్దీ నియంత్రణకు అంత్రాలయ ప్రదక్షణ, యంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదలచేసి లఘు దర్శనానికి పరిమితం చేయాలని ఆలయవిభాగ సిబ్బందికి సూచించారు. నిరంతరాయంగా పులిహోర వితరణ చేపట్టాలని సూచించారు.

గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్ ప్రారంభం


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో 20 పడకల ఆసుపత్రి నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట ఆదర్శనగర్‌లో డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల, డాక్టర్ రేఖ పోతూరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. న్యూరాలజీ ,మెదడు, జనరల్ వైద్యవిభాగం ,గైనకాలజి సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జనరల్ సర్జన్ తాతిన రాంబ్రహ్మం, డాక్టర్ పొత్తూరి చౌడప్ప , జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కాకినాడకు చెందిన సైక్రియాట్రిస్ట్ డాక్టర్ మల్లికార్జునరావు, పిడియాట్రిక్స్ డాక్టర్ పాకలపాటి రవికిరణ్, ప్రముఖ న్యూరాలజిస్ట్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్లు ఎస్ఎస్ రామరాజు, డాక్టర్ కర్రి రామారెడ్డి, నిమ్మలపూడిగోవిందు, డాక్టర్ పి.రవికిరణ్ పాల్గొన్నారు.

స్వామివారికి బంగారు ఆభరణాల అలంకరణ


కల్యాణోత్సవాల్లో స్వామివారికి అలంకరించే ఆభరణాలు



అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిది సంవత్సరాల నుంచి స్వామివారి పూర్వ నగలను బ్యాంకులో ఉంచి ప్రస్తుతం కొత్త ఆభరణాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ సమయంలో స్వామివారి కుందనపు కిరీటం ధరిస్తారు. వక్షస్థలం, శంఖుచక్రాలు, అనేక బంగారు ఆభరణాలు ధరించే స్వామివారిని దర్శించుకోవడంవల్ల జన్మజన్మల పుణ్యఫలం వస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ ఆభరణాలన్నీ వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు వంటివి పూర్వకాలంలో మహారాజులు సమర్పించారని చెబుతారు. పూర్వపు ఆభరణాలు శిథిలావస్థకు చేరుకోవడంవల్ల బ్యాంకుల్లో భద్రపరిచారు. అంతర్వేదికర గ్రా మంలో ఉన్న అంతర్వేదికి చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులచే ఉత్సవమూర్తులకు మాత్రం సాదా ఆభరణాలు తయారుచేయించి వార్షికంగా ఉత్సవాలకు అలంకరిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులు మిరియాల గాంధీ దంపతులు స్వామివారికి బంగారు శఠగోపాన్ని, పూణె వాస్తవ్యులు వేంకటేశ్వరా హేచరీసంస్థ నిర్వాహకులు స్వామివారికి బంగారు పంచపాత్రలు, ఉద్ధరిణీలు, బిందె, పళ్లెం, బంగారు ఆభరణాలు సమర్పించారు.

పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేత

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన వార్షిక దివ్య తిరు కల్యాణానికి పొలమూరు, శ్రీశృంగేరి జగద్గురు భారతీతీర్థ మహాస్వామి, విదుశేఖరభారతిస్వామివార్లు తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందించారు. గుడిమెల్లంక శ్రీవిద్యాభారతి శంకరపీఠం తరుపున దేవదాయశాఖ, ఆలయ అధికారులకు, పండితులకు అందించినట్టు తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో

సత్యదేవ నర్సరీకి స్థానం


తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్ పత్రాలు చూపుతున్నచంటి, పెదసత్యనారాయణ

కడియం, ఫిబ్రవరి 19: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అయోధ్య రామమందిరం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కడియపులంక పుల్లా చంటియ్యసత్యదేవా నర్సరీలో మొక్కలతో రామమందిరం, రాముని ప్రతిరూపం, అయోధ్య ఆలయం, దేశప్రధాని మోదీ ప్రతిరూపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్‌లో స్థానం దక్కింది. తమకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్‌లో స్థానం దక్కడం సంతోషంగా ఉందని చంటియ్య ఆయన కుమారుడు పెదసత్యనారాయణ అన్నారు.

వేటకు వెళ్లి గుండెపోటుతో మత్స్యకారుడు మృతి



కరప, ఫిబ్రవరి 19: సముద్రంలోకి వేటకెళ్లిన మత్స్యకారుడు బోటులోనే గుండెపోటుతో మరణించిన ఘటన కాకినాడజిల్లా కరప మండలం ఉప్పలంకలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలంక గ్రామానికి చెందిన పెసంగి వెంకటేశులు(52)సోమవారం తెల్లవారుజామున సహచర మత్స్యకారులతో కల్సి సముద్రంలోకి వేటకు వెళ్లాడు. వేట సమయంలో గుండెలో నొప్పి ఉందని వెంకటేశులు చెప్పడంతో వెంటనే సహచరులు బోటును ఒడ్డుకు చేర్చేందుకు వేగంగా వస్తుండగా మార్గమధ్యలో బోటులోనే మరణించాడు. మృతు నికి భార్య చంద్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షులు బొమ్మిడి సతీష్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశులు మృతి చెందడం వారికుటుంబీకులు దిక్కులేని వారయ్యారని బాధితుల పరిస్థితిని ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి తీసుకెళ్లి సాయమందించాలని కోరారు.

నేడు ధవళేశ్వరం జనార్ధన స్వామి రథోత్సవం


ఉభయ దేవేరులతో జనార్ధన స్వామి, రథోత్సవం (ఫైల్)



ధవళేశ్వరం, ఫిబ్రవరి 19: పురాణ ప్రసిద్ధిగాంచి జనార్ధనగిరిపై ఉన్న లక్ష్మీ జనార్ధనస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించడానికి అధి కారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ పరిసరాలను చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలకరించారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగిస్తారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ వినయ్ మోహన్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించనున్నారు. రాత్రికి కొండపై స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

క్రీడల్లో ఉన్నతంగా రాణించాలి

- సినీ హాస్యనటుడు ఆలీ


క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఆలీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19: క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ప్రముఖ సినీ హాస్య నటుడు ఆలీ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఆర్‌పీఎల్ (రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్) సీజన్-6 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి అలరించారు. జాతీయస్థాయిలో రాణించిన ఎందరో క్రీడాకారులు చిన్న చిన్న టోర్నమెంట్లలో ఆడినవారే ఉన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ 2031 నాటికి ఇక్కడి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, టోర్నమెంట్ నిర్వాహకులు అజ్జరపు వాసు, కుంచే శేఖర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 19: డ్రైనేజీకి సంబంధించిన గొడవ విషయమై గునపంతో దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. కాకినాడ అర్బన్ గొడారిగుంట సీతారామ్‌నగర్‌కు చెందిన తల్లిబోయిన వెంకన్న బావమరిది కఠారిశ్రీను ఇంటి పక్కన నివాసం ఉండేవారు. 2020, సెప్టెంబరు 29న డ్రైనేజీకి సంబంధించిన గొడవ విషయమై గొల్లపల్లి దుర్గాలు, కొండ వెంకటేష్, గొల్లపల్లి రమణ, కొండ మణికంఠ మధ్య తలెత్తిన వివాదంతో వీరంతా కలసి తల్లిబోయిన వెంకన్నపై గునపంతో, రాళ్లతో దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. ఈ సంఘటనపై కాకినాడ సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎన్.సతీష్‌బాబు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులను సోమవారం కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన తర్వాత నిందితులపై నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడిగా ఉన్న గొల్లపల్లి దుర్గాలుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి ఎంపీఎస్ పద్మజ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఏ2 కొండ వెంకటేష్, ఏ3 గొల్లపల్లి రమణ, ఏ4 కొండ మణికంఠలకు తలో రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ కె.రాధాకృష్ణరాజు వాదించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన వ్యాన్

- ఒకరి మృతి.. ఇద్దరికి స్వల్పగాయాలు


మృతుడు చైతన్‌దాడియ

దేవరపల్లి, ఫిబ్రవరి 19: జీవనోపాధి కోసం వచ్చి రోడ్డు ప్రమాదానికి గురైై వ్యక్తి మృతి చెంది కుటుంబానికి విషాదం మిగిల్చిన ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం జాతీయ రహదారివద్ద జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సోమవారం భీమవరం నుంచి విశాఖపట్నం డెకరేషన్ సామగ్రితో వెళ్తున్న వ్యాన్ దేవరపల్లి మండలం కృష్ణంపాలెం సమీపంలో సర్వీసు రహదారిలో పంటబోదెలోకి దూసుకెళ్లి సిమెంటు దిమ్మను ఢీకొట్టింది. వ్యాన్ క్యాబిన్‌లో ముగ్గురు ప్రయాణిస్తుండగా ఒరిస్సాకు చెందిన వ్యాన్ క్లీనర్ చైతన్ దాలియ(54) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్, మరొకరికి స్వల్ప గాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా దాలియ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు ఇటీవల జీవనోపాధి నిమిత్తం కుమారుడితో కలిసి విశాఖపట్నం వచ్చాడని, ఈనెల 17న భీమవరంలోని ఒక ఫంక్షన్‌కు డెకరేషన్‌చేసి ఆదివారం తెల్లవారుజామున తిరిగి సామగ్రితో వెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తువల్ల ప్రమాదం జరిగినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

ఉప్పుటేరులో ఈతకు వెళ్లి విశాఖ యువకుడి మృతి


మృతిచెందిన షేక్ మౌలాలీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 19: ఉప్పుటేరులో స్నేహితులతో ఈతకు వెళ్లిన విశాఖకు చెందిన యువకుడు మృతి చెందినట్టు కొత్తపల్లి ఎస్ఐ పీవీ స్వామినాయుడు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మౌలాలి(22) ఆదివారం కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగిన బంగారుపాప ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో స్నేహితులతో కలిసి స్థానికంగా రామన్నపాలెం, మూలపేట మధ్య ఉన్న ఉప్పుటేరులో ఈతకు వెళ్లాడు. ఒడ్డుకు చేరే ప్రయత్నంలో ఉప్పుటేరు ఉధృతికి మౌలాలి నీటమునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. అతడి స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. మౌలాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

శంఖవరం, ఫిబ్రవరి 19: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు సోమవారం కాకినాడజిల్లా కత్తిపూడి పాత చెక్‌పోస్టు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. విశాఖ నుంచి భద్రాచలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అన్నవరం ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... డ్రైవర్‌కి బీపీ తక్కువకావడంతో ఇబ్బంది పడుతుండగా అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. పదిమంది స్వల్పంగా గాయపడగా ప్రాథమిక వైద్యం అందించి వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

సందేశాన్ని ఇస్తూ...ఆలోచింపజేసిన నాటికలు


స్వర్గానికి వంతెన నాటిక సన్నివేశం

తాటిపర్తిలో ముగిసిన ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 19: సమాజంలో జరుగుతున్న విషయాలు, సంఘటనలకు అద్దం పడుతూ అదే సమయంలో అందరినీ ఆలోచింపచేస్తూ, సందేశాన్ని ఇస్తూ సాగాయి నాటికలు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో భాగంగా చివరిరోజు ప్రదర్శించిన నాటికలు అన్నింటికీ డబ్బే ప్రధానం కాదని, చేసిన మంచి పని ఎల్లప్పుడూ గుర్తు ఉంటుందని తెలియజేశారు.

- మనిషికి మరణం అనివార్యం. జీవితకాలంలో మంచి పనులు చేస్తే అవి ఎల్లప్పుడు గుర్తు ఉంటాయి అని చాటి చెప్పింది స్వర్గానికి వంతెన నాటిక. తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను వల్లూరు శివప్రసాద్ రచించగా, గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు.
- డబ్బు కోసం ఆడిన పెళ్లి నాటకం బయటపడటం, అదే అదనుగా న్యాయవాది ఆ మహిళను వివాహం చేసుకోవాలనుకోవడం, చివరికి అన్ని విషయాలు బయటకు వచ్చి తప్పుడు మార్గంలో పయనించాలనుకున్న వారికి బుద్ధి చెప్పడాన్ని పక్కింటి మొగుడులో ప్రదర్శించారు. కొప్పోలు పండు క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోవిందరాజు నాగేశ్వరరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు.

ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం నాటిక

ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల ప్రదర్శనలో గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన అమృతహస్తం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ మైత్రి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన బంధం నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా ఎస్.రవీంద్రరెడ్డి(ఇంద్రప్రస్థం), ఉత్తమ రచనగా సత్యనారాయణ(అమృతహస్తం), ఉత్తమ నటుడిగా గోపరాజు విజయ్(కౌలస్య సుప్రజ రామ), ఉత్తమ నటిగా రత్నకుమారి(బంధం), ఉత్తమ ప్రతినాయకుడిగా ఏపూరి హరిబాబు(అమృతహస్తం)లు ఎంపిక కాగా జ్యూరీ అవార్డులకు పిఠాపురం బాబూరావు, టి.శ్రీలేఖ, సురభిలతలు ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతలుగా రాజా తాతయ్య, గారపాటి శ్రీనివాస్‌లు వ్యవహరించగా, మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది పడాల రవి తదితరులు విజేతలకు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేత



'ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం పాటించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 19: ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం పాటిస్తూ పాలన చేయాలని జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ ఆధ్వర్యంలో 28వ డివిజన్ తిలక్‌వీధిలో ఇంటి పన్నుల విధానాన్ని వ్యతిరేకించే యుద్ధానికి మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. అడబాల సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీను, సుంకర రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, పాలిక శివ, వాసు పాల్గొన్నారు.

'దళితులపై పెనుభారం మోపిన సీఎం జగన్'

గొల్లప్రోలు, ఫిబ్రవరి 19: దళితులకు పూర్తిగా ఉచిత విద్యుత్ ఇస్తామని గద్దెనెక్కిన సీఎం జగన్‌రెడ్డి గతం నుంచి అమలవుతున్న పథకాలకు కోతలు విధించి వారిపై పెనుభారం మోపారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు 1,2,3,4 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను ఆయన సోమవారం నిర్వహించారు. ఇప్పుడు వారికి స్లాబ్‌ల పేరుతో ఒక్కో ఇంటికి రూ.70వేలకు పైగా బిల్లులు వేసి చెల్లించాలని ఒత్తిడి తేవడంతో పాటు లేకుంటే మీటర్లు పట్టుకుపోతున్నారని మండిపడ్డారు. దళితులపై చూపే ప్రేమ ఇదేనా అని నిలదీశారు. ఎస్సీ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కుళాయిల ద్వారా కలుషిత జలాలు వస్తున్నాయని తెలిపారు. కమిషనరుకు ఫోన్ చేయగా 2 రోజులు గడువు కోరారని, అప్పటికి స్పందించకుంటే వార్డు నిద్ర కార్యక్రమం చేపట్టి డ్రెయిన్‌లో మురుగును నగరపంచాయతీ కార్యాలయం వద్ద వేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. సురక్షితమైన తాగునీటి అందరికి అందించకుంటే నగరపంచాయతీకి తాళాలు వేస్తామని అల్టిమేటం జారీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, నాయకులు దొమ్మేటి మనోహర్, గంధం నాగేశ్వరరావు, గోనెల సుదారాణి, శౌరీ, గంటా చంద్రరావు, కడారి బాబ్జి, బస్వా సత్యనారాయణ పాల్గొన్నారు.

'దళితులను మోసం చేసిన జగన్'

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 19: దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారికి సంబంధించిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి జగన్‌రెడ్డి మోసం చేశారని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ విమర్శించారు. పిఠాపురం మండలం విరవాడ గ్రామానికి చెందిన దళిత యువ నాయకుడు దారా ప్రసాద్, అతడి మిత్రబృందం సభ్యులు జనసేన పార్టీలో చేరారు. వారందరికి ఉదయ శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దళితుల సంక్షేమం జనసేన పార్టీతోనే సాధ్యమని, వారికి ఎల్లప్పుడు సముచిత ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీని గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు, జనసైనికులు ఉన్నారు.

'జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం'

తుని రూరల్, ఫిబ్రవరి 19: అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. సోమవారం మండలంలో చామవరం, ఎస్.అన్నవరం పంచాయతీ శాంతినగర్‌లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటా ప్రచారం చేపడుతూ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, జనసేన నాయకులు చోడిశెట్టి వెంకటేష్, ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), గజ్జి రాంబాబు పాల్గొన్నారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు'

పిఠాపురం, ఫిబ్రవరి 19: కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తు చేసుకునే వారి నుంచి డిజిటల్ సేవా సెంటర్లల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు హెచ్చరించారు. విశ్వకర్మ యోజనా పథకం దరఖాస్తు రుసుముగా రూ.50 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, పట్టణంలోని సెంటర్లలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఆయన సోమవారం తనిఖీలు నిర్వహించారు. పక్షులమర్రిచెట్టు సెంటర్, అగ్రహారం వద్ద గల డిజిటల్ సేవా కేంద్రాల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు తనిఖీల్లో గుర్తించామని, ఇలా అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డిజిటల్ సేవా నిర్వాహకులను హెచ్చరించినట్టు ఆయన చెప్పారు.

'ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19: రాప్తాడులోఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని ఏలేశ్వరం పాత్రికేయులు ఖండించారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్లో పాత్రికేయుల అత్యవసర సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకుప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న పత్రికా విలేఖరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు దిగడం దారుణమన్నారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పాత్రికేయులు పట్నాయక్, చిడగం మాధవ, గొల్లపల్లి శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, బి.సతీష్, దాడిశెట్టి వీరబాబు, పి.రాంప్రసాద్, ఎస్.మల్లికార్జునరావు, దాసరి కృష్ణ, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19: ప్రత్తిపాడులో రూ2.50కోట్ల వ్యయంతో నిర్మించే రామాలయం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. నరేంద్రగిరి కొండపై శ్రీ మద్ రామాయణ పీఠం ఆధ్వర్యంలో నిర్మించే శంకుస్థాపన పూజల్లో గల్లా పద్మరావు, నూకరత్నం, దాట్ల పుష్పారెడ్డి, రాజేశ్వరి, ఓడూరి సత్యనారాయణ, వరలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. గండేపల్లి విద్యరేణియా ఆశ్రమానికి చెందిన సాధుప్రసాద్ స్వామిజీ, చిత్రాడ శ్రీకృష్ణ సుందర ఆశ్రమ స్వామిజీ, రాచపల్లి రమణా సేవాశ్రమ స్వామిజీరమణానంద స్వామిజీలు, శ్రీమద్ రామాయణ పీఠం అధ్యక్షుడు గల్లాసుబ్బారావు, సానా నూకరాజు నాయుడు, దొడ్డిపట్ల సోమన్నదొర, చెక్కపల్లి రాంబాబు, జువ్వల చినబాబు, మదినే నైకరాజు, పత్తిరమణ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భూమి పూజ

కరప, ఫిబ్రవరి 19: గ్రామ పంచాయతీ ప్రక్కన గ్రంథాలయం వీధిలో సోమవారం శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి జడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి భూమి పూజ చేశారు. శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు అన్నప్పాచార్యులు, అధ్యక్ష, కార్యదర్శులు వై.వీరబ్రహ్మం, వి.మల్లేశ్వరరావు, కె. గోవిందాచార్యులు పాల్గొన్నారు. శివగంగ రజక సంఘం కమ్యూనిటీ హాలు, మెయిన్‌రోడ్డు ఎస్సీ వీధిలోని అంబేద్కర్ విగ్రహానికి షెల్టర్ నిర్మాణ పనులకు ఎంపీపీ, జడ్పీటీసీ భూమి పూజ చేశారు. ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మేడిశెట్టి సత్తిబాబు, మండల యూత్ అధ్యక్షులు పెంకే సత్తిబాబు, ఎస్కే.నాగేంద్రకుమార్ ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడికి 9 నెలల జైలు శిక్ష

పిఠాపురం, ఫిబ్రవరి 19: చోరీ కేసులో నిందితుడికి తొమ్మిది నెలల జైలుశిక్ష విధిస్తూ పిఠాపురం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుదారాణి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం.. పిఠాపురంలో అగ్రహారం శివారు రాపర్తి రోడ్డులో ఎం.జయలక్ష్మి కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. 2021 నవంబరు 15న రాత్రి దుకాణం వద్దే పడుకుంది. అక్కడికి సమీపంలోనే ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. బంగారు, వెండి వస్తువులు చోరికి గురైనట్టు గుర్తించి పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చోరికి పాల్పడిన హైదరాబాదులోని కూకట్‌పల్లికి చెందిన మనీష్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అంగీకరించడంతో మెజిస్ట్రేట్ జైలుశిక్ష విధించారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, ఫిబ్రవరి 19: స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్న క్యాంటీన్‌లో టీడీపీ ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ సోదరుడు దివంగత కొండ రఘువీర్ జ్ఞాపకార్థ సాయితేజ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన భోజనాలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పేదలకు వడ్డించారు. జగ్గంపేట, గండేపల్లి మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, కురుకూరి రమేష్ పాల్గొన్నారు.

గిరిజనులకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19: మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో 40 మంది గిరిజనులకు సోమవారం బీజేపీ నాయకులు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ వాటిని మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాయుడు ముత్యాలరావు, ప్రభాకర్, గంటా బాలుదొర, దత్తాత్రేయ, కర్రి ధర్మరాజు, చింతాకుల రామకృష్ణ, కందా వీరాస్వామి, కొల్ల శ్రీనివాస్, దాకే కృష్ణారావు, కించు జోగిరాజు పాల్గొన్నారు.

రేపు గోగులమ్మ, మహాలక్ష్మమ్మల తీర్థం

కరప, ఫిబ్రవరి 19: సిరిపురం గ్రామదేవతలైన గోగులమ్మ,మహాలక్ష్మమ్మల తీర్థం బుధవారం ఉంటుందని ఆలయ ధర్మకర్త చిక్కాల వీరవెంకటసత్యనారాయణ అన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, ఊరు పేరు భైరవకోన, మేడెమిచెట్, గుంటూరుకారం, ట్రూలవర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, యాత్ర 2, ఊరు పేరు భైరవకోన, గుంటూరుకారం

తిరుమల	:	సూర్యసన్ఆఫ్‌కృష్ణన్, ఓయ్
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
పద్మప్రియ	:	ఊరు పేరు భైరవకోన
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

భీమేశ్వరాలయ ఈవో బాధ్యతల స్వీకరణ

సామర్లకోట, ఫిబ్రవరి 19: సామర్లకోట భీమేశ్వరాలయ ఈవోగా బళ్ళ నీలకంఠం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే వేదస్వస్తి పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలు భక్తులు,వివిధ వర్గాల ప్రజల సంయుక్త సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తానన్నారు. పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబును కలిశారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

సీఎం జగన్‌పై విరుచుకుపడిన టీడీపీ నేతలు


పిఠాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 19: సీఎం జగన్‌రెడ్డి సిద్ధం సభలు పెట్టి అశుద్ధం మాటలు చెబుతున్నాడని, ఒక చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి విధ్వంసం సృష్టించిన వైసీపీ ప్రభుత్వం తీరుపై విసిగిపోయిన ప్రజలు ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు సిద్ధంగా ఉన్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పాలన ఎవరిదో, విధ్వంసం ఎవరు సృష్టించారో తేల్చేందుకు తనతో చర్చకు రావాలని ఆయన జగన్‌కు సవాల్ విసిరారు. ఓటమి భయంతో బదిలీలు అంటూ 77మందిని జగన్ మడతపెట్టాడని, మరో 50రోజుల్లో మిగిలిన వారందరిని ప్రజలు మడత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రూ.10 ఇచ్చి 100 రూపాయిలు దోచిన జగన్ సంక్షేమంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యేలు చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు. ఏలేరు ఆధునీకరణ పనులు నిలిపివేసి, పురుషోత్తమపట్టణం ఎత్తిపోతల పథకాన్ని పనిచేయనీయకుండా చేసి రైతుల నోట్లో మట్టికొట్టారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, దేవరపల్లి రామారావు, ఎలుబండి రాజారావు, బర్ల అప్పారావు, మడికి ప్రసాద్, బత్తుల చైతన్య రాజేష్, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, కొరుప్రోలు శ్రీను, మసకపల్లి రాజా, అడ్డూరి శ్రీను తదితరులున్నారు.

చంద్రబాబుతో చర్చకు సిద్ధమా : నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 19: అభివృద్ధి పాలన ఎవరిదో, విధ్వంసం ఎవరితో జగన్ రెడ్డితో చర్చించేందుకు మా నాయకుడు చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని, జగన్ సిద్ధంగా ఉన్నాడా అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ప్రశ్నించారు. ఇర్రిపాకలో నెహ్రూ మీడియాతో మాట్లాడుతూ ఎవరి పాలన స్వర్ణయుగమో.. ఎవరిపాలన రాతి యుగమో తేల్చేద్దాం.. చంద్రబాబుతో చర్చకు రండంటూ సవాల్ విసిరారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి అబద్ధాల మాటలు చెపుతున్నాడన్నారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్కఛాన్సే జగన్‌కు రాజకీయంగా చివరిఛాన్స్ అని, ఈ ఎన్నికల తర్వాత జగన్ మూటముళ్లు సర్దుకుని రాష్ట్రం వదిలి పోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచెయ్యడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారు. ఓటమి భయంతో బదిలీలు అంటూ 77 మందిని జగన్ మడత పెట్టాడన్నారు.. సమాజానికి ఫోర్త్ పిలర్‌గా ఉన్న మీడియా వాస్తవాలు ప్రజలకు తెలియజేస్తుంటే తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారా అంటూ తన రౌడీమూకలు, గుండాలతో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో జిల్లా టీడీపీ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు కన్నబాబు, అడపా భరత్‌బాబు, గండేపల్లి మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, సుంకవిల్లి రాజు, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర,పీ.ప్రసాద్ ఉన్నారు.

జగన్ మాయమాటలు నమ్మరు : నవీన్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 19: జగన్‌రెడ్డి చెప్పే మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని, ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి సిద్ధం నినాదంపై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారన్నారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్స్ జగన్‌రెడ్డికి రాజకీయంగా చివరి చాన్స్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో నిజంగా పెత్తందారు జగన్‌రెడ్డికి ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతుందన్నారు.

జగన్ రాష్ట్రానికి ఏం చేశావు : సత్యప్రభ

శంఖవరం, ఫిబ్రవరి 19: జగన్ రాష్ట్రానికి నువ్వు ఏం చేశావు...ఓట్లు ఎలా అడుగుతావు అంటూ ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపులు సత్యప్రభ అన్నారు. నెల్లిపూడిలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ మేనిఫెస్టో భవద్గీత, ఖురాన్, బైబిల్ అని చెప్పిన వ్యక్తి మేనిఫెస్టోలో హామీలు గాలికి వదిలి ఎలా ఓట్లు అడగాలి అనిపిస్తుందని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం లేదు, జాబ్‌క్యాలెండర్ లేదు, ప్రత్యేకహోదాలేదు, రాజధాని లేదు పోలవరాన్ని పట్టించుకోలేదు ఎలా ఓట్లు అడుగుతావని ధ్వజమెత్తారు. సామాజిక న్యాయం అని చెప్పి బీసీలు, దళితులను అనేక విధాలుగా మోసం చేసిన వ్యక్తివి నువ్వు అన్నారు. గతం ప్రభుత్వం పేదలకు అమలు చేసిన పథకాలు నిలిపివేసి పేదల పొట్టకొట్టిన చరిత్రనికే ఉందన్నారు. నీకు ఓటు వేయడానికి ప్రజలు వెనకాడుతున్నారని, జనసేన-టీడీపీకి ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, పర్వత సురేష్, వెన్నాశివ, ఉల్లివీరబద్రరావు, బచ్చల గంగ, బద్దిరమణ తదితరులు ఉన్నారు.


శంఖవరం: విలేకర్లలో మాట్లాడుతున్న సత్యప్రభ

వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ


కిర్లంపూడి: టీడీపీలోకి చేరినవారితో నెహ్రూ


సామర్లకోట:టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చినరాజప్ప

కిర్లంపూడి, ఫిబ్రవరి 19: వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జగపతినగరంలో సోమవారం పెద్ద రామాలయం వద్ద ఆళ్ళ బాబులు, పెద్ద రాఘవ బ్రదర్స్ ఆధ్వర్యంలో పలు వైసీపీ కుటుంబాలకు చెందిన మహిళలు భారీ సంఖ్యలో టీడీపీలోకి చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు అధ్యక్షతన క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, తూము కుమార్, ఆళ్ళ నానాజీ, శ్రీమన్నారాయణ, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ సమక్షంలో టీడీపీలోకి చేరగా నెహ్రూ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీలతా రాంబాబు, వీరంరెడ్డి కాశీబాబు, రాయుడు బాబురావు, గండే కాశీ, కాళ్ళ వెంకటేష్, నంది బాలకృష్ణ, అమ్మాజీ, కందా సత్యానందం, కాకిలేటి రాయుడు, బుజ్జి, సూరిశెట్టి వెంకట శివ,గొడేబాల, బొజ్జపు శ్రీను, స్వామి, సూరిబాబు, మంచికంటి శ్రీను, పేపకాయల వేణు, బుద్ద నానాజీ పాల్గొన్నారు.

ఇర్రిపాకలో..

జగ్గంపేట, ఫిబ్రవరి 19: ఇర్రిపాక శివాలయం వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో మన్యం వారి పాలెం గ్రామ పంచాయతీ 5వ వార్డు సభ్యులు నక్క రాంబాబు, ఆయన మిత్రులు దూండ్రు వీరబాబు, పి.సత్తియ్య, గండికోట వీరబాబు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. పోతుల మోహన్‌రావు, కన్నబాబు, అడపా భరత్‌బాబు, కుంచే రామకృష్ణ, సుంకవిల్లిరాజు, కొత్త నాగపండు,పీటీ ప్రసాదు, మేడిశెట్టి నారాయణరావు ఉన్నారు.

మాధవపట్నంలో...

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

సామర్లకోట, ఫిబ్రవరి 19: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన టీడీపీ విజయానికి బీసీలు అందరూ కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. మాధవపట్నం గ్రామంలో జమునానగర్ కాలనీ, బీసీ కాలనీలో వెనుకబడిన కులపెద్దలు, తోలుబొమ్మలాట కళాకారులు, వివిధవర్గాల ప్రతినిధులను రాజప్ప, తనయుడు రంగనాగ్ నాయకులు, కార్యకర్తలతో కలిశారు. చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, తోటకూర శ్రీనివాస్, కుర్రా నారాయణస్వామి, సర్వేశ్వ రరావు, మసిముక్కల చిట్టిబాబు, పిల్లి శ్రీను, పెంకే అప్పా రావు పాల్గొన్నారు. మాధవపట్నంలో సుమారు 70 మంది కార్యకర్తలు చినరాజప్ప సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీకి ముద్దన రాజీనామా

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 19: వైసీపీ విజయానికి తొలి నుంచి కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా, అవినీతి,అక్రమాలకు పాల్పడిన స్థానిక నాయకులకు ఎమ్మెల్యే కన్నబాబు ఒత్తాసు పలకడంతో మనస్థాపంతో ఆపార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ముద్దన సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం సర్పవరంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ టీడీపీలో నుంచి వైసీపీలోకి వస్తే గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇస్తానని స్థానిక నేత పుల్ల కోటేశ్వరరావు హామీ ఇచ్చారని, ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. ఏపార్టీలో చేరేది నిర్ణయాన్ని త్వరలో వెల్లడిస్తానని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ప్రాధాన్యం

డీఈవో రమేష్




అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఈవో

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 19: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు అధిక ప్రాధాన్యత ఉందని, ప్రజలకు మంచిచేసే నాయకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటనే వజ్రాయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి ఎస్‌వీఈఈపీ(స్వీప్) కార్యక్రమంలో భాగంగా సోమవారం రమణయ్యపేట ఏపీఎస్పీ మోహన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఓటర్లకు ఓటుహక్కుపై అవగాహన,చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరికీ భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పించిందన్నారు. యువకులు ఓటుహక్కుపై పూర్తి అవగాహనకలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా సచ్ఛీలులైన ప్రజా ప్రతినిధులను చట్టసభలకు పంపవచ్చని, తద్వారా మెరుగైన ప్రజాపాలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు, వినియోగం, ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. స్వీప్ కమిటీ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందించిన పలు కళారూపాలు, జానపద, నృత్య ప్రదర్శన, లఘునాటికలు ఆకట్టుకున్నాయి. ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.శివప్రసాద్, ఎస్ఎస్‌పీ ఆఫీసర్ ఎంఎస్.సుబ్రహ్మణ్యం, ఎంఈవో ఎల్.గణేష్ బాబు, మోహన్ స్కూల్ కరస్పాండెంట్ మోహనరావు, డైరెక్టర్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

శెట్టిబలిజలకు టీడీపీలోనే సముచిత స్థానం

టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్


మాట్లాడుతున్న కన్వీనర్ సత్తిబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 19: శెట్టిబలిజలకు టీడీపీలోనే సముచిత స్థానం లభిస్తోందని టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా అధ్యక్షతన కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గ పార్టీ శెట్టిబలిజ నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కన్వీనర్ సత్తిబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో శెట్టిబలిజ కులానికి చెందిన పలువురికి సీట్లు, పదవుల విషయంలో తగిన ప్రాధాన్యం కల్పించారన్నారు. రాబోయే టీడీపీ ప్రభుత్వంలోను తగిన ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చారన్నారు. మార్చి మొదటివారంలో నిర్వహించే నిర్వహించే శెట్టిబలిజ సాధికారిత రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా మాట్లాడుతూ శెట్టిబలిజల ఐక్యత ద్వారా టీడీపీలో రాజకీయ ప్రాధాన్యాన్ని సాధించుకోగలమన్నారు. నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, పంపన బుజ్జి, చొల్లంగి వీరబాబు, కాకరపల్లి చలపతి, పలివెల త్రిమూర్తులు, కొండా వినాయక్, పితాని అప్పన్న, వాసంశెట్టి చిట్టప్ప, రాయుడు అనిల్ పాల్గొన్నారు.

రహదారి పనుల అడ్డగింత

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 19: అరకొరగా రహదారి పనులు నిర్వహించడంపై 3 గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు అడ్డుకున్నారు. పిఠాపురం బైపాస్‌రోడ్డు నుంచి నరసింగపురం, జములపల్లి, గోకివాడ గ్రామాల మీదుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉంది. అడుగడుగున గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోడ్డు పనులు చేపడతామంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వేశారు. రోడ్డు పూర్తిగా వేస్తారనుకుంటే క్రషర్ బూడిద వేశారు. సోమవారం అక్కడక్కడ తారు వేసి పనులు చేపడుతున్నారు. అరకొరగా మరమ్మతులు చేపట్టడంపై గోకివాడ, జములపల్లి, నరసింగపురం గ్రామాల పనులు అడ్డుకుని పూర్తిస్థాయిలో రోడ్డును పునర్నిర్మించాలని కోరారు.


కాకినాడ స్పందనలో ఫిర్యాదు పరిశీలిస్తున్న ఏడీసీ

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 19: ప్రజలు ఎదుర్కొనే ప్రతిఒక్క సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఫోన్ ద్వారా, నేరుగా వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఏడీసీ ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు మొత్తం 17 మంది దరఖాస్తులు వచ్చాయి. రోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలలోపు టోల్‌ఫ్రీ నెంబరు 18004255990కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని ఏడీసీ తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, టీపీఆర్‌వో మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఏవో శిరీష్, సూపరింటెండెంట్‌లు ఉన్నారు.

'అధికారులు విధిగా హాజరుకావాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 19: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా వారంవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యా లయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి పలు సమస్యలపై అర్జీదారులు కార్యాలయానికి వస్తుంటారని, వారి సమ స్యలను సత్వరమే పరిష్కరించేందుకు డివిజన్ స్థాయి అధికారులంతా స్పందన కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. పలు సమస్యలపై 16 అర్జీలను స్వీకరించామని ఆర్డీవో తెలిపారు.

'ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలి'

గండేపల్లి,ఫిబ్రవరి 19: రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ సహకరించాలని గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. రామయంపాలెంలో సోమవారం పోలింగ్ కేంద్రాలు పరిశీలించి గ్రామపెద్దలు వివిధ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పోలీసులు ఉన్నారు.

గురజనాపల్లిలో ఆర్‌జేడీ తనిఖీ


విద్యార్థులతో ఆర్‌జేడీ నాగమణి

కరప, ఫిబ్రవరి 19: గురజనాపల్లి శ్రీ పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షల్లో వందకు వందమార్కులు సాధించడానికి కష్టపడి చదవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి టీచర్ కొంతకొంది చదువులో వెనుకబడిన వారిని దత్తత తీసుకుని వారి ప్రగతిని పరిశీలించాలన్నారు. ఉపాధ్యాయులు హాజరు, పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడల్లో, సాంస్కృతిక విషయాల్లో ప్రతిభ కనబరుస్తు విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయ బృందం ఆర్‌జేడీని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం వీవీ.రమణమూర్తి తదితరులు ఉన్నారు.

ఏవీ నగరంలో కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న యనమల దంపతులు

తొండంగి, ఫిబ్రవరి 19: ఏవీ నగరంలో కొలువైన శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున షిరిడి సాయినాదుని ఆలయంలో కాకాడ హారతి,గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. సాయినాధునికి పంచామృతాభిషేకం, విశేషపూజ నిర్వహించిన అనంతరం భక్తులతో సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి అనంతరం విశేష పూజ జరిపారు. పల్లకీ సేవ నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు,విజయలక్ష్మి దంపతులు గోపూజ, దీక్షాధారణ, విఘ్నేశ్వరపూజ, పవిత్రజలాలతో కూడిన అష్టోత్తర శతకలశ పూజ నిర్వహించారు. అంకురార్పణ, ధ్వజారోహణ, యాగశాల ప్రవేశ కార్యక్రమాలను రుత్వికులు, అర్చకులు నిర్వహించారు.

సీతారాముల పట్టాభిషేక విగ్రహ ప్రతిష్ఠ


గొల్లప్రోలులో విగ్రహ ప్రతిష్ఠ దృశ్యం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 19: గొల్లప్రోలు దేవుడిగుడి రామకోవెలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీతారాముల పట్టాభిషేక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం కనులపండువగా జరిగింది. తొలుత విఘ్నేశ్వరపూజ, మండపారాధనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు, రుత్విక్కుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠ, కళాన్యాసం జరిగాయి. అనంతరం హోమం నిర్వహించారు. మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

భవన రుషి అమ్మవారికి పూజలు

గండేపల్లి, ఫిబ్రవరి 19: గండేపల్లిలో పురాతనంగా భద్రావతి భవన రుషి అమ్మవారి ఆలయాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సోమవారం దర్శించుకున్నారు. నెహ్రూకు పురోహితులు పూర్ణకలశాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఉప్పలపాడులో పడమటిశెట్టి బాలాజీ కాలనీలో నూతన రామకోవెల ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠలో నెహ్రూ పాల్గొన్నారు. టీడీపీ మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి రాజు, యలమాటి కాశీ, వెంపాటి రాజు, రెడ్డిసుబ్బారావు, ఇప్పిర్ల బాబి ఉన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

పిఠాపురం, ఫిబ్రవరి 19: పిఠాపురంలో ఛత్రపతి శివాజీ 394వ జయంతి సందర్భంగా సోమవారం శివాజీ చిత్రపటానికి జనసేన నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లా శివశంకర్, డాక్టర్ అనుదీప్, ముమ్మిడి సంతోష్, పెదిరెడ్ల మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

తాళ్లరేవు, ఫిబ్రవరి 19: కోరింగలో వేంచేసిన శ్రీవేణుగోపాల స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈనెల 20 నుంచి 25 వరకు జరుగనున్నట్టు ఈవో వడ్డి ఫణీంద్రకుమార్ తెలిపారు. స్వామివారి కల్యాణం, సదస్యము, శ్రీచక్రస్నానము, శ్రీపుష్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

చొల్లంగిలో నిరసన దీక్ష

తాళ్లరేవు, ఫిబ్రవరి 19: చొల్లంగిలో ఇళ్ల స్థలాలు స్థానికులకే ఇవ్వాలని చేపట్టిన నిరసనదీక్ష 20రోజు సోమవారం కొనసాగింది. చొల్లంగిలో అంతా ఫ్యానుకు రెక్కలు విరిగిపోయి జనాలంతా సైకిలు ఎక్కేందేకు సిద్దంగా ఉన్నారని ఆందోళనకారులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

చేబ్రోలులో ప్రారంభోత్సవాలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 19: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబులు సోమవారం ప్రారంభించారు. గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, మార్కెట్‌కమిటీ చైర్మన్ మొగలి విమలబాబ్జి, గొల్లప్రోలు ఎంపీపీ అరిగెల అచ్చియమ్మ రామయ్యదొర ఉన్నారు.

బస్సులో పర్స్ చోరీపై కేసు

సామర్లకోట, ఫిబ్రవరి 18: సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రామచంద్రపురం బస్సులో దిగిన మహిళా ప్రయాణికురాలి బంగారు ఆభరణాలతో కూడిన పర్స్ గల్లంతు కావడంతో సామర్లకోట పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చంద్రేడు రాయవరానికి చెందిన కృష్ణవేణి రామచంద్రపురం నుంచి సామర్లకోటకు చేరుకుని రాజానగరం వైపు వెళ్తున్న బస్సు ఎక్కి చూసుకునే సరికి తన పర్స్ చోరీ అయినట్టు గుర్తించి పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేసారు. అయితే సంఘటనా ప్రాంతం సామర్లకోట కాంప్లెక్స్ కావడంతో సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు కేసు రిఫర్ చేశారు. సుమారు రూ.80వేల విలువ గల ఆభరణాలు, నగదు పర్స్‌లో ఉన్నట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె తెలిపారు.